కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారి

నవతెలంగాణ-భిక్కనూర్

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జంగంపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగంపల్లి గ్రామానికి చెందిన శివరాజ్ (45) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చూపించినా.. కడుపునొప్పి తగ్గకపోవడంతో తన మేకల కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్ తరలించి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికుమార్ తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

డీసీఎం బోల్తా

- పరారీలో డ్రైవర్



బోల్తాపడిన డీసీఎం

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సమీపంలో ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వెళ్తున్న డీసీఎం బోల్తా పడినట్లు గ్రామస్తులు తెలిపారు. తౌడులోడుతో ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వెళ్తుండగా గురువారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. కాగా డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి



ఆశావర్కర్ల భారీ ర్యాలీ

- పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఇన్సూరెన్స్, రిటైర్మెంట్, ప్రమోషన్స్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి డిమాండ్





మాట్లాడుతున్న ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి.. సభకు హాజరైన ఆశావర్కర్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనంగా నిర్ణయించాలని, అలాగే పిఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని, ఇన్సూరెన్స్, రిటర్మెంట్, ప్రమోషన్స్, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఆశా యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ తరఫున నిర్వహిస్తున్న బస్సుజాత జగిత్యాల నుంచి నిజామాబాద్ జిల్లాకు గురువారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆశావర్కర్లు పెద్ద ఎత్తున నాయకత్వానికి పూలుజల్లుతూ స్వాగతం పలికారు. బస్సు జాతలో పాల్గొన్న నాయకులకు ముందుగా శాలువాలతో సత్కరించి స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నుంచి సుభాష్‌నగర్, నిర్మల హృదయ పాఠశాల, హమాల్‌వాడి చౌరస్తా మీదుగా సీఐటీయూ కార్యాలయానికి భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిఐటీయూ కార్యాలయంలో జరిగిన సభలో ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కన్నా ముందు ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, కనీస వేతనం రూ.18 వేలు అమలు చేస్తామని హామీనిచ్చి సంవత్సర కాలం పూర్తయినప్పటికీ ఆశావర్కర్ల సమస్యలు పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ప్రభుత్వంలో చలనం లేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఈనెల 15 నుంచి 31 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆశావర్కర్లను చైతన్యం చేస్తూ పర్యటిస్తున్నామని తెలిపారు. 31వ తేదీ లోపు ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించని యెడల భవిష్యత్తు కాలంలో నిరవధిక సమ్మెకు కూడా సిద్ధమవాల్సి వస్తుందని ఆమె అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు చెందిన ఆశావర్కర్లు రాత్రనకా, పగలనకా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని, అయినప్పటికీ చాలీచాలని వేతనాలతో తమ జీవితాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు జరపాలని నిర్వహిస్తున్న ఈ బస్ జాతకు ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారని తెలిపారు. పోరాటాల్లో నిజామాబాద్ జిల్లా ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ల రాష్ట్ర నాయకులు పద్మ, సాధన, గంగామణి, ఐలా దేవి, సునీత, బాలమణి, ఆశావర్కర్ల జిల్లా నాయకులు రేణుక, సుకన్య, రేవతి, లలిత, బాలమణి, రమ, భూలక్ష్మి, రేణుక, రాధ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, కటారి రాములు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డికి చేరిన బస్సుజాత



నవతెలంగాణ-కామారెడ్డి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఆశావర్కర్ల బస్సు జాత ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మీదుగా గురువారం కామారెడ్డికి చేరుకుంది. ఈ జాతకు ఆశావర్కర్లు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అయితే ఈ జాతకు అంగన్వాడీ టీచర్స్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు కేసరి ఇందిర, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశ్రీ, పల్లవి, మమత, పద్మ మంజుల, సుధమ్మ, లావణ్య, భాగ్యలక్ష్మి, కామారెడ్డి సిఐటియు జిల్లా నాయకులు చంద్రశేఖర్, రాజనర్సు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.





మహిళా సంఘం సభ్యుల ఖాతాలకు లాక్

- రుణానికి సంబంధించిన డబ్బులు చెల్లింకపోవడంతోనే..
- ఇబ్బంది పడుతున్న మహిళా సంఘాల సభ్యులు

నవతెలంగాణ-రామారెడ్డి

మహిళా సంఘం సభ్యుల ఖాతాలకు ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు లాక్‌వేశారు. దీంతో వారు తమ అవసరాల కోసం ఖాతాలోంచి డబ్బులు తీసుకుందామంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని రెడ్డిపేట్ గ్రామానికి చెందిన మంజునాథ 10 మంది గ్రూప్ సభ్యులు తీసుకున్న రుణం తాలూకు జూలై, సెప్టెంబర్ డబ్బులు చెల్లించలేదని ఎస్‌బీఐ ఖాతాను బ్యాంక్ అధికారులు బ్లాక్ చేశారు. ఆరుకాలం కష్టించి పండించిన పంట డబ్బులు తీసుకుందామని మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుకు వెళితే ఈ విషయం తెలియడంతో అవాక్కయ్యారు. ఈ విషయమై బ్యాంక్ అధికారులను మహిళ సంఘాల సభ్యులు అడిగి తెలుసుకోగా డ్వాక్రా మహిళా సంఘం ద్వారా తీసుకున్న బాకీ డబ్బులు గత రెండు నెలల నుండి చెల్లించలేదని, దీంతో పదిమంది సభ్యుల ఖాతాను బ్లాక్ చేశామని బ్యాంక్ అధికారులు తెలిపారు. ఈ విషయమై ఐకెపి అధికారులకు సమాచారం ఇచ్చినా వారు స్పందించటం లేదు. తమ పంట డబ్బులతో పాటు, ఇతర డబ్బులు ఖాతాలో ఉన్నాయని, అవసరాల కోసం తీసుకుందామంటే ఖాతా బ్లాక్ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

దీనిపై సీసీ దుర్గ దాసును నవతెలంగాణ మూడు రోజుల క్రితం విషయాన్ని తెలుపగా.. సమస్య పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటివరకు పరిష్కరించలేదు. దీనిపై ఏపీఎం ప్రసన్న కుమార్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి రాలేదని, మీ ద్వారానే ఈ సమస్య నాకు తెలిసిందని తెలిపారు. ఇదిలా ఉండగా.. గ్రామంలో మహిళా సంఘానికి సంబంధించిన నిధులు గోల్‌మాల్ జరిగినట్టు ఆరోపణలున్నాయి.

ఐకేపీ అధికారులు పట్టించుకుంటలే



నా ఖాతా రెడ్డిపేట ఎస్బిఐ బ్యాంకు అధికారులు బ్లాక్ చేశారు. అందులో కుటుంబ అవసరాల కోసం రూ.60,000 ఉన్నాయి. ఐకెపి అధికారులకు 15 రోజుల నుంచి చెప్పినా పట్టించుకోవడం లేదు. బ్యాంక్ మేనేజర్, సీఏ, అధికారులను తీసుకొచ్చి సమస్య పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు.

– బొల్లారం ఎల్లవ్వ, మంజునాథ గ్రూప్ సభ్యురాలు

పర్యావరణ పరిరక్షణలో కామారెడ్డి ఎల్లప్పుడూ ముందుంటుంది

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

పర్యావరణ పరిరక్షణలో కామారెడ్డి జిల్లా ఎప్పుడూ ముందుంటుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, తెలంగాణ విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్కూల్ ఎర్త్ క్లబ్ - యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో లీడ్ ఎర్త్ లీడర్స్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ సిజిఆర్ సంస్థ, విద్యార్థులను భాగస్వాములను చేసి చేపట్టిన పర్యావరణ కార్యక్రమాలను అభినందించారు. విద్యార్థులందరూ వారి వారి పాఠశాలల్లో, పల్లెల్లో కలిసి కట్టుగా పర్యావరణ సంరక్షణలో పాల్గొని జిల్లాని ఉన్నత స్థాయిలో ఉంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిజిఆర్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఒక గొప్ప సంకల్పంతో ప్రారంభించిన యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం ఈ స్థాయిలో విజయవంతం కావడానికి ముఖ్య కారణం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అని కొనియాడారు. విద్యార్థులతో మాకు ఈ సమన్వయం ఇలాగే ఉంటే త్వరలోనే రాష్ట్రాన్ని పచ్చగా మార్చగలమని ధీమా వ్యక్తం చేశారు. ఆచార్య ఉపేందర్ రెడ్డి, వందేమాతరం రవీంద్ర, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భిక్నూర్ ప్రధానోపాధ్యాయులు వారి వారి పర్యావరణ ఉపన్యాసాలతో విద్యార్థులకి చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.రాజు, డిఆర్డిఓ ఎం. సురేందర్, ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ రామకృష్ణ, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ ఎం.జ్యోతి, డిఏఓ తిరుమల ప్రసాద్ హాజరయ్యారు. జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాం రెడ్డి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, సిజిఆర్ రాష్ట్ర కార్యదర్శి యానాల వెంకట్ రెడ్డి, సీజీఆర్ సభ్యులు అన్నమయ్య, అనుదీప్, జ్ఞానేశ్వర్, నగేష్, నల్సార్ విశ్వవిద్యాలయ విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్
- జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల తనిఖీ



సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ-మోర్తాడ్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మహత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసే భోజన సామగ్రిని, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం భోజన మెనూను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అనారోగ్యం బారిన పడకుండా వారికి అందించే ఆహార వస్తువులు నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతీది పరిశీలించి విద్యార్థులకు అందించాలని అన్నారు. డైట్ చార్జీలను 40 శాతం వరకు ప్రభుత్వం పెంచుతూ ఇటీవల నిర్ణయం తీసుకుందని దానికి అనుగుణంగా విద్యార్థులకు ఆహార పదార్థాలను అందించాలని తెలిపారు. విద్యార్థులకు ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా పాఠశాలలో తగు ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షల పనులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మేరకు ఔషధాలు అందుబాటులో ఉన్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అన్ని అందుబాటులో ఉన్నాయని అత్యవసర పరిస్థితులలో వైద్య ఆసుపత్రికి తరలించి ఔషధాలు పంపిణీ చేస్తామని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ చక్కగా చదువుకొని ఉత్తమ ర్యాంకులు సాధించాలని అన్నారు. విద్యార్థుల నైపుణ్యాల అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తూ మెరుగుపరచాలని సూచించారు. అత్యల్ప మార్కులు వచ్చే సిలబస్‌లను దృష్టిలో ఉంచుకొని ఆ విద్యార్థికి ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసి అత్యధిక మార్కులు వచ్చేలా ప్రోత్సహించాలని అన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి..

మండలంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ మండల అధికారులకు సూచించారు. మండల కేంద్రంతోపాటు వడ్యాట్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ప్రతి వాటిని మొబైల్ యాప్ ద్వారా రికార్డులను నమోదు చేయాలని, రోజువారీగా యాప్ అప్డేట్ అవుతుందని అందులో ప్రతి సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. మండల కేంద్రంతో పాటు వడ్యాట్ గ్రామంలో చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ పూర్తి సమాచారాన్ని యాప్‌లో పొందుపరిచి లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా నిర్వహించాలని సొంత ఇల్లు అయితే నిర్ధారణ డాక్యుమెంట్లు గానీ ఇంటి పన్ను రసీదులుగాని అప్‌లోడ్ చేయాలని సూచించారు. సర్వేలో ఎలాంటి తప్పిదాలు లేకుండా ఈ నెల ఆఖరిలోగా పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి అధికారులు సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని అన్నారు.

కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, మోర్తాడ్ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో తిరుమల, ఎంపీవో శ్రీధర్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ పట్ల అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సరికాదు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.రమేష్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంబేద్కర్ పట్ల అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పి, మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పట్ల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. వెంటనే అమిత్ షా భారత జాతికి క్షమాపణ చెప్పాలని, తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య మత విద్వేషాలను పెంచటం కోసం 'అంబేద్కర్‌ను స్మరించటం కన్నా.. దేవుణ్ణి మొక్కితే సరిపోతుందనే' పద్ధతుల్లో వ్యాఖ్యానించటం అంటే భారత రాజ్యాంగాన్ని, లౌకిక విధానాలను, ప్రజాస్వామ్యాన్ని అంబేద్కర్‌ను ఏ దృష్టితో చూస్తున్నారో అర్థమవుతుందన్నారు. ప్రజల్లో మత విద్వేషాలను రగల్చి వాటి ద్వారా తమ రాజకీయ లబ్ధి పొందాలని ఏకైక లక్ష్యం తప్ప రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల వారికి విశ్వాసం లేకపోవడమే కారణమని తెలిపారు. అమిత్ షా వైఖరిని సమర్థిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడటం పూర్తిగా వ్యతిరేక వైఖరిని తెలియజేస్తుందన్నారు. ఈ విధానాలను వీడనాడి భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని అప్పుడే ప్రజాస్వామ్యం మరింత పరిఢ విల్లుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ నాయకులు రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల వంటావార్పు



రోడ్డుపైనే భోజనం చేసి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం పదవ రోజుకు చేరుకుంది. ఈ నిరసనలో భాగంగా వంటావార్పు నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడులలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులను రోడ్డుపైన భోజనం చేసేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి, సమగ్ర శిక్ష ఉద్యోగులు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పడాల రవీందర్ మాధవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చర్చించినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం బాధాకరమని తెలిపారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు రాములు, సంతోష్‌రెడ్డి, శ్రీధర్, దామోదర్ శైలజ, మాధవి, శ్రీను, వీణ, లావణ్య, కాళిదాసు, వనజ దినేష్, సంధ్యా, శంకర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

చిరుతల సంచారం..?

- భయాందోళనలో ఆయా గ్రామాల ప్రజలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పలు గ్రామాల అటవీ ప్రాంతాల్లో చిరుతలు సంచరిస్తున్నట్టు మండల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కంచుమల్ అటవీ ప్రాంతంలోని రహదారిపై బుధవారం రాత్రి 8 గంటలకు చిరుత కనిపించడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. సీతాయిపల్లి, కంచుమల్ మార్గమధ్యలో రహదారిపైకి చిరుత రావడంతో అదే సమయంలో ఆరోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కొనసాగుతుండడంతో రాకపోకలను సాగిస్తున్న రైతులు పంట పొలాలకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నామని వాపోతున్నారు. అదేవిధంగా గత నాలుగు రోజుల క్రితం బోనాల్ బాణాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఉదయం చిరుత, దాని పిల్ల రోడ్డు దాటి అటవీ ప్రాంతానికి వెళుతున్న సమయంలో వాహనదారులు చిరుతను చూశారని చెబుతున్నారు. అటవీ అధికారులు చిరుతలు గ్రామ సమీపంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సిమెంట్ సంచుల మధ్యలో పిల్లల చదువులా...?

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు
- లిటిల్ స్కాలర్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్



పాఠశాల వద్ద మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్ ప్రైవేటు పాఠశాల విద్యార్థుల తరగతులను నిర్మాణంలో ఉన్న భవనంలో నిర్వహిస్తూ సిమెంటు సంచుల మధ్యల విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులు నిర్వహించడం పట్ల విద్యార్థి సంఘాల నాయకులు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలను సందర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ లిటిల్ స్కాలర్ ప్రైవేటు పాఠశాలలో ఇష్టానుసారంగా ధనార్జనే ధ్యేయంగా వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రు లకు మాయ మాటలు చెప్తూ విద్యార్థులకు సౌకర్యాలను కల్పించడంలో మాత్రం పాఠశాల యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఆ పాఠశాలలో విద్యార్థులకు సరిపడా గదులు లేకున్నా ఇష్టానుసారంగా అడ్మిషన్లు చేపడుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అనుమతి ఉన్న భవనంలో విద్యార్థులు పట్టలేక అనుమతులు లేని నిర్మాణంలో ఉండి పూర్తికాని భవనంలో తరగతులు నిర్వహిస్తూ ఆ నిర్మాణ మెటీరియల్ సిమెంటు సంచులు, ఇసుక బస్తాలు, కర్రలు, ఎలాంటి వెలుతురు లేని భవనంలో విద్యార్థులను కూర్చోబెట్టి క్లాసులు నిర్వహించడం సరైన పద్ధతి కాదని అన్నారు. నిర్మాణంలో ఉన్న ఆ భవనంలో నుండి వచ్చే వ్యర్థాల వలన విద్యార్థులు ఆరోగ్యం క్షీణించడమే కాకుండా శ్వాసకోస, చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఆ పాఠశాల యాజమాన్యానికి వత్తాసు పలకడం తగదని అన్నారు. పాఠశాలలో 1500 పైగా మంది విద్యార్థులు ఉంటే, కనీసం 200 గజాల ఆట స్థలం కూడా లేదని, విద్యార్థులకు మానసికోల్లాసం కల్పించే క్రీడలను కూడా పాఠశాల యాజమాన్యం ఆడించట్లేదని అన్నారు. వెంటనే దీనిపై కలెక్టర్ స్పందించి పాఠశాల యాజమాన్యం మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విటల్, జివిఎస్ రాష్ట్ర నాయకులు వినోద్ చౌహన్, నాయకులు రాహుల్, శివ, వినోద్, నవీన్, ప్రసాద్, శ్రీహస్ పాల్గొన్నారు.

విజయ్ హైస్కూల్‌లో బాల కవి సమ్మేళనం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని విజయ్ హైస్కూల్ వేదికపై గురువారం బాలకవి సమ్మేళనం ఏర్పాటు చేసినట్టు ప్రధానోపాధ్యాయురాలు టి.కవితాదివాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఒకటవ తరగతి నుండి రెండవ తరగతి విద్యార్థులకు "నాన్న" మూడవ తరగతి నండి ఐదవ తరగతి విద్యార్థులక 'పండుగ', ఆరవ తరగతి, పదవ తరగతి విద్యార్థులకు "పక్షులు" అనే అంశాలపై సాంప్రదాయ దుస్తులు ధరించి చక్కటి కవితలను వినిపించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రకటిచండం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన సునీల్ కుమార్



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ గురువారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన సాక్షి రిపోర్టర్ శంకర్ వాల్ల అమ్మ రాజుబాయ్ ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో వారి కుటుంబాన్ని సునీల్ కుమార్ పరామర్శించారు. అనంతరం కమ్మర్ పల్లికి చెందిన సుంకరి రాజేశ్వర్ వల్ల నాన్న నర్సయ్య ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల గంగారెడ్డి, సింగిరెడ్డి శేఖర్, నిమ్మ రాజేంద్రప్రసాద్, అజ్మత్ హుస్సేన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి మండల కేంద్రానికి చెందిన ఎన్నారై చింత బలరాం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. గురువారం విరాళం మొత్తాన్ని అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఆర్థికంగా తోడ్పాటు అందించిన చింత బలరాంను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చింత హనుమంతు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, అయ్యప్ప మాలధారణ స్వాములు ప్రతాప్, జితేందర్, మణికంఠ, రోహిత్, భవన్, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులు పునఃప్రారంభం



తరగతి గదులను ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుపన్ పల్లిలో తరగతి గదులను గురువారం పునఃప్రారంభించారు. మూడు తరగతి గదుల్లో టైల్స్ పగిలిపోవడంతో..విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. ఈ అనే విషయాన్ని "బెస్ట్ రన్నర్స్ గ్రూప్" "ఎన్నారై సంస్థ" మిత్రులకు తెలియజేవారు. వారు వెంటనే స్పందించి మూడు తరగతి గదులను రెండు లక్షల రూపాయలతో మరమ్మతులు చేయించి, బాగు చేయించారు. ఆ తరగతి గదులను గ్రూపు మెంబర్స్ అయిన సతీష్, నర్సిరెడ్డి, గౌతమి, ప్రధానోపాధ్యాయురాలు శకుంతలా దేవి అధ్యక్షతన, నగర కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ లీడర్ లింగం, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, అంజయ్య, జయ సాగర్, తదితరుల సమక్షంలో పున ప్రారంభించారు. అనంతరం బెస్ట్ రన్నర్స్ గ్రూప్ మెంబర్స్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలను, విద్యార్థులను, తీర్చిదిద్దడంలో మా సంస్థ ఎల్లవేళలా కృషి చేస్తుందని, ప్రతి విద్యార్థి చక్కగా చదివి, వారి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు "బెస్ట్ రన్నర్స్ గ్రూప్ మెంబర్స్"ను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. సమస్యను ఎన్నారై గ్రూప్ వారికి తెలియజేసి..వారి ద్వారా..సహాయం పొందడానికి కృషి చేసిన గ్రామ సొసైటీ అధ్యక్షులు రవీంధర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చలో హైదరాబాద్ అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ధర్నా

నవతెలంగాణ-ధర్పల్లి

కార్మికుల సమస్యలపై చలో హైదరాబాద్ కార్యక్రమం అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు గురువారం (టీయుసీఐ) జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. రమేష్ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ అర్ధరాత్రి నాయకులను, పంచాయతీ కార్మికులను అక్రమ అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. రేవంత్ సర్కార్ గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోగా కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఉద్యమిస్తుంటే అక్రమ అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రజా పాలన, ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల పట్ల అత్యంత దుర్మార్గంగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు తక్షణమే గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుడు మరణిస్తే దహన సంస్కారాలకు 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా ప్రతి కార్మికుడికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని అన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో గ్రామపంచాయతీ కార్మికులతో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు, కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆశన్న, సాయిలు, వీలాష్, గంగాధర్, కృష్ణ, రాములు,రమేష్ రవి, సాయవ్వ, సులోచన, సునీత, రాజవ్వ, తదితరులు పాల్గొన్నారు

మెపా నిజామాబాద్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

- ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ ముదిరాజ్





నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) నిజామాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో మెపా కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మెపా నిజామాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించారు. అధ్యక్షులుగా బీంగల్ మండలం చెంగల్ గ్రామానికి చెందిన మోహిని నరేష్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కమ్మర్‌పల్లి మండలం, హాసకొత్తూరు గ్రామానికి చెందిన రేషమైన శ్రీకాంత్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఆర్మూర్ మండలం పత్తెపూర్ గ్రామానికి చెందిన జుంగాల గంగాధర్ ముదిరాజ్‌ను రాష్ట్ర కమిటీ సూచన మేరకు నియమించారు. అనంతరం నూతంగా ఎన్నికైన నరేష్, శ్రీకాంత్, గంగాధర్ ముదిరాజ్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో అన్ని మండల కమిటీలు త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాతి అభివృద్ధి, ఐక్యత కోసం, రిజర్వేషన్ సాధన కోసం కృషి చేస్తామన్నారు. ఈ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బొట్ల పల్లి సంజీవన్ కుమార్, కార్యదర్శి దండు చిరంజీవి కుమార్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్ లతో మెపా రాష్ట్ర, నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ముదిరాజ్ లు ఐక్యంగా ఉండి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. రిజర్వేషన్ కోసం ప్రభుత్వం పై పోరాటం చేయాలని అన్నారు. ముదిరాజుల విద్యా ఉద్యోగాల కోసం మెపా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆళ్ళ నరేష్ ముదిరాజ్, సింగారపు రామ కృష్ణ, నీరటి రాజు, రావుల కిరణ్ ముదిరాజ్, మహేష్, లింగయ్య రమేష్, కుమారస్వామి లతో పాటు కుల బంధువులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి వద్ద నిఘంటువు ఉండాలి

- ప్రొఫెసర్ యద్దనపూడిరెడ్డి శ్యామల



మాట్లాడుతున్న ప్రొఫెసర్ యద్దనపూడిరెడ్డి శ్యామల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పదాలను నిర్మించడంలో ఆరోపాల ఎంపిక జాగ్రత్తగా చేసుకోవాలని, ప్రతి విద్యార్థి దగ్గర నిఘంటువులు ఉండాలని ప్రొఫెసర్ యద్దనపూడి రెడ్డి శ్యామల పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగం, భారతీయ భాష సంరక్షక కేంద్రం ఆధ్వర్యంలో పునశ్చరణ తరగతులు రెండవ రోజు నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ తెలుగు శాఖ, దక్షిణ ప్రాంతీయ బాషా కేంద్రం, భారతీయ భాషా సంస్థ నిర్వహణలో జరుగుతున్న తెలుగు అధ్యాపకుల ఓరియెంటేషన్ కార్యక్రమంలో మొదటగా నిఘంటు నిర్మాణ మెళకువలు అనే అంశంపై ప్రొఫెసర్ యద్దనపూడి రెడ్డి శ్యామల మాట్లాడుతూ పదాలను నిర్మించడంలో ఆరోపాల ఎంపిక జాగ్రత్తగా చేసుకోవాలని, ప్రతి విద్యార్థి దగ్గర నిఘంటువులు ఉండాలని నొక్కి చెప్పారు. నిఘంటువుల అధ్యయనం లేని చదువులు హృదయానికి దగ్గర అవ్వవని చాలా విపులంగా వివరించారు. రెండవ సమావేశంలో ప్రొఫెసర్ చింతకింది ఖాసీం తెలుగు భాషలోని ఉద్యమాల నిర్దిష్ట స్వరూప స్వభావాలను, అక్షర నిర్మాణ క్రమ వికాస దశలను, కవులుగా ఉన్నవారు బావుకులుగా మారిన విధం కళ్ళకు కట్టినట్లు చెప్పి, నూతనంగా అధ్యయనం, అధ్యాపనలు ఉండాలన్నారు. గుంటూరు లక్ష్మి నర్సయ్య తెలుగు కవిత్వ శిల్ప సౌందర్యం, మనో వైజ్ఞానిక తాత్వికత, ఆంగ్ల సాహిత్య ప్రభావం గురించిన లోతైన విశ్లేషణతో పాల్గొన్న అందరిని రంజింపచేశారు. ప్రొఫెసర్ కరిమిండ్ల లావణ్య తెలుగు వ్యాస పరిణామ దశలను, పరిశీలన దశలను కూలంకషంగా వివరించారు. అందరూ చిన్న వ్యాసాలతో పాటు పెద్ద పెద్ద వ్యాసాలు వైజ్ఞానిక వ్యాసాలు రాసి పేరు తెచ్చుకోవాలని, తెలుగు భాషను ప్రేమతో చెప్పాలని సదస్యులకు వివరించారు. ఈ సదస్సులో పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

నవతెలంగాణ-మాక్లూర్/ధర్పల్లి

మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులను మండల ఎంపీడీఓ, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్ మండల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఇల్లు ఉందా, స్థలం ఉందా, ఏవిధంగా ఉంటున్నారు అనే అంశాలను అడిగారు. లబ్ధిదారుల వివరాలు సరిగ్గా నమోదు చేయాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేఖర్, ఎంపీఓ శ్రీనివాస్, అర్ ఐ షఫీ, కార్యదర్శి రాకేష్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

ధర్పల్లి : మండలంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతుంది. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో నిజమైన నిరుపేదలకు గుర్తించి వారికి పథకం అందించే ఉద్దేశంతో చేపడుతున్న సర్వే ను గురువారం దమ్మన్నపేట్ గ్రామంలో తహసీల్దార్ బండారి మాలతీ పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలలోని విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో..

కుంట ఖబ్జా అంటూ పార్టీపై విషప్రచారం తగదు

- కొందరు మాజీలు చేస్తున్న అబద్ధపు ప్రచారమే
- దమ్ముంటే చర్చకు రండి
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్న బాలరాజ్

నవతెలంగాణ-ధర్పల్లి

వారం రోజులనుండి మండల కేంద్రంలోని దమ్మన్నపేటకు వెళ్లే ప్రధాన రోడ్డుకు సమీపంలోని కుంట భూమిని గ్రామస్థులు, స్థానిక కాంగ్రెస్ నాయకుల అండదండలతో ఖబ్జా చేస్తున్నారని మండలకేంద్రములో ఎక్కడ చుసిన చర్చలు వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి ఓ ఆన్లైన్ పత్రికలో వార్త వచ్చిన నేపథ్యంలో గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో పాటు ఆపార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బల్ రాజ్ స్పందిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు ఈసందర్బంగా అయన మాట్లాడుతూ.. కుంట భూమి కబ్జా జరుగుతుందని, స్థానిక నాయకులూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు తన దృష్టికి రావడంతో తహసీల్దార్‌కు వివరణ కోరానని అన్నారు. జరిగిన విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, ఎమ్మెల్యే స్పందించి కుంట అక్రమ కబ్జాపై అధికారులతో మాట్లాడడంతో సంబంధిత జిల్లా సర్వే అధికారులు వచ్చి సర్వే నిర్వహించారని, నివేదిక వచ్చిన అనంతరం వాస్తవాలు బయట పడుతాయని తెలిపారు. కుంట పక్కనే సర్వే నెంబర్ 1317లో స్థానికులకు సొంత భూమి ఉన్నట్లు, పట్టాలు ఉన్నాయని చూపుతున్నారని, ఆ భూమిని మొరం వేసి భూమిని చదును చేసుకుంటుంటే దానికి కొందరు గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ పేరు బద్నామ్ చేసే పనిలో గ్రామంలో వదంతులు సృష్టిస్తున్నారని తెలిపారు. స్థానిక సర్పంచి ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని, కాంగ్రెస్ పార్టీ పుంజుకున్న విషయాన్ని జీర్ణించుకోలేక, పార్టీని బద్నామ్ చేసే విధంగా అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు . ఈ విషయంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రశ్నించడంతో విడిసిని రెండుగా చీల్చి వారిమధ్య గొడవలు సృష్టించి, కమిటీని బర్తరఫ్ అయ్యేవిధంగా చేశారని దుయ్యబట్టారు. ,గ్రామంలో జరుగుతున్న కబ్జాలపై, అవినీతిపై తమ పార్టీ పరంగా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, వచ్చే గురువారం గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ ఆలయం వద్ద బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ఆధారాలతో రావాలని, గ్రామస్తులు వాస్తవాలు తెలుసుకునేందుకు తప్పని సరిగా రావాలని పిలుపునిచ్చారు. వదంతులపై మీడియా మిత్రులు సైతం వాస్తవాలను వెలికి తీయాలని అన్నారు. కొందరు యూట్యూబ్ వాళ్ళు అబద్దపు మాటలను నమ్మి ప్రసారం చేస్తున్నారని, వారిపై చట్టరిత్య చర్యలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశం అనంతరం చదును చేస్తున్న భూమి వద్దకు పలువురు గ్రామస్థుల తోపాటు మీడియా మిత్రులను వెంట పెట్టుకొని వెళ్లి వివరాలను తెలిపామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్, నాయకులు బొక్కల బాలయ్య, చెలిమెల శ్రీనివాస్, రాకేష్, ఖలీల్, దినకర్, అరుగుల పెద్ద బాల్ రెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినీలు మనోధైర్యాన్ని కలిగి ఉండాలి

- అవగాహన కల్పించిన షీటీం



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని చిట్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్లు విఘ్నేశ్, రాజ్ పాల్, హెడ్ కానిస్టేబుల్ సుమతి షీ టీం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ గురించి అవగాహన కలిగిస్తూ విద్యార్థినులు, మహిళలు వేధింపులు, ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే వెంటనే డయల్ 100, షీ టీం నెంబర్: 8712659795కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థినులు నిర్భయత్వాన్ని, మనోధైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు సుమతి, విఘ్నేశ్, రాజ్‌పాల్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రామారెడ్డి, పద్మ, శ్రీనివాస్, రాజేందర్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో టాలెంట్ డే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాదు నగరంలోని శంకర్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో గురువారం టాలెంట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ జిల్లా అదనపు కార్యదర్శి కరిపె రవీందర్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. కష్టమనుకోకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాదించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వాసుదేవరావ్, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.లింబాద్రి, సీహెచ్, రవీంద్రనాథ్, కోశాధికారి పి.రాఘవేందర్, పూర్వాధ్యక్షులు సి.గంగాదాస్, ఉపాధ్యాయులు మల్లేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవుని ఆభరణాల చోరీ.. గోప్యతలో ఆంతర్యం ఏమిటో..?

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమాన్ దేవస్థానం నందు గత కొద్ది నెలల క్రితం దేవుని ఆభరణాలు మాయం కావడం, వీటి గోప్యతపై పట్టణ ప్రజలు తీవ్ర విస్మయానికి గురవుతున్నారు. గత అక్టోబర్ 7న యధావిధిగా పూజ కార్యక్రమానికి వెళ్లగా అక్కడ ప్రధాన గేటు తాళం తీసి ఉందని లోపలికి వెళ్లి చూడగా గర్భగుడికి తాళం పగలగొట్టి ఉందని, మందిరం ప్రధాన గేటు తాళం చెవి అటెండర్ వద్ద, గర్భగుడి తాళం చెవి తన దగ్గర ఉందని ఆలయ అర్చకులు నర్సింగ్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను వెళ్లేసరికి ప్రధాన గేటు తాళాలు తీయబడి, గర్భగుడి తాళం పగలగొట్టి ఉన్నాయని, ఈ విషయాన్ని ఆలయ ఈవోకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్టు పేర్కొన్నారు. వారు వచ్చి పరిశీలించగా ఆంజనేయ స్వామి వారి విగ్రహంపై ఉన్న పురాతన వెండి ఆభరణాలు దొంగిలించినట్టు తెలిసిందని తెలిపారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచామని చెప్పినట్టు చెబుతున్నారు. ప్రతిరోజు దేవాలయానికి వచ్చే భక్తులు అడుగగా ఏమి పోలేవని ..దాటవేస్తూ వచ్చినట్టు తెలిపారు. దసరా మరుసటి రోజు 13న ఆలయ అధికారులు పిలిచి ఇక్కడ జరిగిన దొంగతనాల విషయాన్ని భక్తులకు చేరవేస్తున్నామనే కోపంతో నవంబర్ 1 నుండి విధుల నుండి వెళ్లిపొమ్మని, హెచ్చరించినట్టు ఆయన తెలిపారు. దేవాలయ పవిత్రతను దెబ్బతీస్తున్న సంబంధిత వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తొమ్మిది సంవత్సరాలుగా దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ జంబి హనుమాన్ దేవస్థానంకు అర్చకునిగా విధులు నిర్వహిస్తున్నారని, ఈ విషయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎండోమెంట్ విజిలెన్స్, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇట్టి ఈ విషయాన్ని దేవాలయ పూర్వభక్తులు, మాజీ చైర్మన్‌లకు, గ్రామ పెద్దలకు తెలిపినట్టు చెప్పారు. దేవుని గుళ్లో చోరీపై గోప్యత పాటించటం వెనుక ఆంతర్యం ఏమిటో... అని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

హిందీ భాష ఉపాధ్యాయుల సమావేశం



ఉపాధ్యాయుల సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో హిందీ భాష ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కాంప్లెక్స్ సమావేశాన్ని బాయ్స్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య అధ్యక్షతన నిర్వహించారు. బాల్కొండ, ఆర్మూర్ మండలాల హిందీ భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరవ తరగతి విద్యార్థుల నుండి పదవ తరగతి విద్యార్థుల వరకు హిందీలో బాగా చదవడం రాయడం ఎలా అనే అంశంపైన వారి వారి అభిప్రాయాలను అనుభవాలను పంచుకున్నారు. వారి పాఠశాలలో నూతన బోధన పద్ధతులు ఎలా నిర్వహిస్తున్నారు. ఒకరినొకరు తెలుసుకొని వారి పాఠశాలలో అనుసరించేటట్లు శిక్షణ పొందారు. చిట్టాపూర్ హిందీ ఉపాధ్యాయులు సుదర్శన్ జూన్లో రిటైర్మెంట్ సందర్భంగా కాంప్లెక్స్ హిందీ భాష ఉపాధ్యాయులందరికీ , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు శాలువాలతో సన్మానించారు.

కెనాల్ గోడకు మరమ్మతులు ఎప్పుడో

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ నుండి మోపాల్ మండలం వెళ్లే దారిలో రహదారి పక్కన గల కెనాల్‌కు ఒక అడ్డుగోడలాగా నిర్మించారు. మూడు నెలల క్రితం ఒక టిప్పర్ ఢీ కొట్టింది. తృటిలో పెను ప్రమాదం తప్పింది. అప్పుడే సైడ్‌వాలు కూడా టిప్పర్ దాటికి పడిపోయింది. అంతేకాకుండా ఇటీవల కాలంలో ఒక ట్రాక్టర్ కూడా అందులో బోల్తా పడింది. కనీసం ఇప్పటివరకు దాన్ని బాగు చేసిన దాఖలాలు లేవు. రూరల్ నియోజకవర్గం కలిపి ఒకరే ఏఈ ఉండడం వల్ల ఏ మండలానికి వెళ్లాలో తెలియక అయోమయ పరిస్థితి ఉంది. అలాగే గ్రామాల్లో వెళ్లే రోడ్లకు కూడా గుంతలు పడ్డ కూడా ఎవరికి తెలియచేయాలో కూడా తెలియని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముఖ్యంగా ఆర్అండ్‌బి ఉన్నత అధికారులు దీనిపై పర్యావేక్షణ చేసి కెనాల్ పక్కన గోడకు తొందరగా మరమ్మత్తులు చేయించాలని అక్కడికి వెళ్లే బాటసారులు కోరుకుంటున్నారు. ఇక్కడే పక్కన ఒక ప్రముఖ పాఠశాల కూడా ఉంది. పాఠశాల బస్సులు కూడా ఎక్కువ మొత్తంలో ఈ కెనాల్ పక్క రహదారి గుండానే తిరుగుతాయి. భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించద్దు అనుకుంటే ముందుగానే దీనికి మరమ్మత్తులు చేయించాలని అక్కడికి పాఠశాలకు వెళ్లే తల్లిదండ్రులు కూడా పదేపదే కోరుతున్నారు.



సేంద్రియ వ్యవసాయంతో ఎన్నో లాభాలు

- రాష్ట్ర ఫార్మర్ వెల్ఫేర్ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సేంద్రియ వ్యవసాయం సాగుతో ఎన్నో లాభాలు వస్తాయని రాష్ట్ర ఫార్మర్ వెల్ఫేర్ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. గురువారం నగరంలోని న్యాల్కల్ రోడ్‌లో సేంద్రియ సాగు చేస్తున్న ఆకుల పాపయ్య వ్యవసాయ క్షేత్రాన్ని కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ ముదక్ పల్లి రైతులతో కలిసి సందర్శించారు. వ్యవసాయంలో రెట్టింపు లాభాలకు సేంద్రియ సాగు ఉపయోగపడుతుందని ఎంతో ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు కూడా లాభాలు తెచ్చిపెడతాయని అన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శుక్రవారం | డిసెంబర్ 20, 2024 | www.navatelangana.com

రెంజల్‌లో సంత ప్రారంభం



నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన సంతను ప్రారంభించారు. క్రయవిక్రయదారులతో సంత కళకళలాడింది. గత వారం రోజులుగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, యువత పెద్ద మొత్తంలో మండలంలో అన్ని గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తూ తాము ఏర్పాటు చేసుకున్న సంత (అంగడి)ని విజయవంతం చేయడానికి సహకరించాలని కోరగా.. గురువారం కొనుగోలుదారులతో కళకళలాడింది. ప్రతి గురువారం రెంజల్ మండల కేంద్రంలో జరిగే సంతను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాగుకు అవకాశం ఇవ్వాలి

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఆర్‌ఓఎఫ్ పట్టాలు ఇచ్చిన భూములు రైతులు గిరిజనులు పంటలు సాగు చేసుకునేలా అవకాశం కల్పించాలని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు అన్నారు. గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో అటవీ భూముల సరిహద్దులు, ఆర్‌ఓఎఫ్ పట్టాల గురించి ఆయన సభలో మాట్లాడారు. అటవీ భూముల సరిహద్దులకు ఆనుకుని ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట్, గాంధారి, రాజంపేట, ఎల్లారెడ్డి. నాగిరెడ్డిపేట్ ఆయా మండలాల గ్రామాల్లో జరిగిన తండాలలో ప్రజలు విభిన్న రకాల సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జాయింట్ సర్వే నిర్వహించి సాగు చేస్తున్న వారికి న్యాయం చేయాలని ఆయన సభలో మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు.



గాంధారి: మాట్లాడుతున్న నాయకులు



రెంజల్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



కామారెడ్డిలో...

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా దిష్టిబొమ్మ దహనం
- పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని పలు సంఘాలు డిమాండ్ చేశాయి. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు.

గాంధారి : గాంధారి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు దేశ ప్రజల మనోభావాలు తీవ్రంగా కలిసి వేశాయని అందుకు అమిత్ షాను మంత్రి పదవి నుండి తక్షణం బర్తరఫ్ చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ డిమాండ్ చేశారు. పార్లమెంట్లో అమిత్ షా మాట్లాడుతూ అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అని తలిచే కంటే దేవుళ్ళని తలిస్తే స్వర్గానికి పోతారంటూ వాక్యానించడం అంబేద్కర్‌ను అభిమానించే కోట్లాదిమంది దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల గాల ప్రజల మనోభావాలను అవమాన పరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. అమిత్ షా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మూల సిద్ధాంతంలో భాగమేనని అన్నారు. గతంలో కూడా అనేకసార్లు కేంద్ర మంత్రులు, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సైతం రిజర్వేషన్లను సమీక్షించాలని, భారత రాజ్యాంగాన్ని మార్చడానికి అధికారంలోకి వచ్చామని, అంబేద్కర్ ఒక్కరే రాజ్యాంగాన్ని రాయలేదంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని రద్దుచేసి ఆ స్థానంలో కోట్లాదిమంది దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజలను వేల సంవత్సరాలుగా బానిసలుగా మార్చిన అగ్రకుల మను స్మృతిని తీసుకురావాలని ఉద్దేశంతోనే పదేపదే రాజ్యాంగంపై, అంబేద్కర్‌పై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారన్నారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండించకపోగా ప్రధాని నరేంద్ర మోడీ సమర్థించే విధంగా మాట్లాడడం బాధాకరమని అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేసేదాకా దళిత,గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డిసెంబర్ 20వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బలరాం నాయక్, మోతిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు యువజన నాయకులు అబ్బోల్ల శ్రీకాంత్, మాల మహానాడు జిల్లా యువజన ఉపాధ్యక్షులు గైని కిరణ్, గోసంగి సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు పత్రి సురేష్, జిల్లా బీసీ విద్యార్థి సంఘం నాయకులు సిరివేసు సంతోష్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి అమీషా పార్లమెంటులో అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెంటనే వెనుకకు తీసుకోవాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బిక్ష వల్లనే నేడు పార్లమెంటులో మంత్రిగా కొనసాగుతున్నారని వారు స్పష్టం చేశారు. దళితులపై కపట ప్రేమ చూపెడుతూ, అంబేద్కర్ పేరును ఉచ్చరించడమే పాపం అన్నట్టుగా వ్యవహరించడం ఆయన స్థాయికి తగదని వారు హెచ్చరించారు. తక్షణమే ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రామ్ దాస్, చిన్నోళ్ల రాకేష్, లోక కృష్ణ, సరి దాస్, రాజశేఖర్, శ్రీకాంత్, ఇమ్రాన్, సల్మాన్, సాయి కిరణ్, చంద్రకాంత్, వినోద్, శ్రీను, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం పార్లమెంట్లో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని నందివాడ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు బక్క గణేష్, మండల మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మమత, గ్రామ అధ్యక్షుడు సంఘ పోచయ్య శంకర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్: మాట్లాడుతున్న నాయకులు

కామారెడ్డి : కేంద్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ, నాయకులు తెలిపారు. బిబిపేట్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ, అంబేద్కర్ సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బిబిపేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుతారి రమేష్, భిక్కనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు, నాయకులు బెల్లె రాజబాబు, శివరాత్రి ప్రవీణ్, ఆకుల రాము, పాత యాదగిరి, పరకాల రవి, శ్రావణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తుజాల్పూర్ గ్రామంలో..

తుజాల్పూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు తలారి కిరణ్ మాట్లాడుతూ.. కేంద్ర హోంమంత్రిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్, సంఘం ప్రతినిధులు రమేష్‌గౌడ్, నరేష్, బాలు, తిరుపతి గౌడ్, శ్రీధర్ గౌడ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో జరిగిన సమావేశంలో హోంమంత్రి అమిత్ షా అవమానించినట్లు మాట్లాడినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య మాట్లాడుతూ.. హోంమంత్రి అమిత్ షా భారత రాజ్యాంగం ద్వారా హక్కుల పొందుతున్న ప్రతి భారతీయ పౌరునికి తక్షణమే క్షమాపణ చెప్పాలని అన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీ టీమ్‌పై అవగాహన

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట్‌లో గురువారం బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో షీ టీమ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఆధ్వర్యంలో చేపట్టే రక్షణ చర్యలపై పోలీస్ సిబ్బంది విజయ్, సుజాత విద్యార్థులకు వివరించారు. మహిళలపై జరిగే నేరాల గురించి, టీ-సేఫ్ యాప్, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, జేజే చట్టం, సైబర్ నేరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రమైన తాడ్వాయి పోలీస్‌స్టేషన్లో బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడి స్టేషన్ ఆవరణలో చెట్టుపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన కీసరి గంగాధర్ హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బాధితునికి కాలు పనిచేయడం లేదని వివరించారు.

బస్టాండ్ ఆవరణలో తారు రోడ్డును ఏర్పాటు చేయాలి

- ఆర్‌టిసి అధికారులకు జానకంపేట గ్రామస్తుల వినతి

నవతెలంగాణ-ఎడపల్లి



మండలంలోని జానకంపేట్ ఆర్‌టిసి బస్టాండ్‌లో తారు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ జానకంపేట గ్రామస్తులు నిజామాబాద్ డిపో మేనేజర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. జానకంపేట బస్టాండ్ రద్దీగా మారుతుందని, బోధన్ డిపోకు చెందిన బస్సులే కాకుండా, నిజామాబాద్, భైంసా డిపో బస్సులు జానకంపేట బస్టాండ్‌లోకి వస్తున్నందు జానకంపేట బస్టాండ్లో గతంలో మొరం పోయడం వల్ల ప్రస్తుతం బస్సు లోపలికి రావడంతో దుమ్ము ధూళి లేచి కాలనీవాసుల ఇళ్లలోకి చేరుకోవడంతో కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

స్థానిక చుట్టుపక్కల ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే బస్టాండ్ ఆవరణంలో తక్షణమే తారు రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జానకంపేట సహకార సంఘం అధ్యక్షులు మిద్దె నరేందర్, మాజీ ఎంపిటిసి మంద సంజీవ్ కుమార్, గంగాధర్, పోతయ్య, రాజమల్లు, శేఖర్, పోశెట్టి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

సర్వేను పక్కాగా నిర్వహించాలి

- సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి
- పలుచోట్ల సర్వే పరిశీలన

నవతెలంగాణ-విలేకరుల బృందం

పిట్లం : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పక్కగా నిర్వహించాలని బాన్సువాడ డివిజనల్ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా సర్వే చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఏ ఒక్క లబ్ధిదారులు తప్పిపోకుండా నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల సర్వే బృందాలకు మండల అధికారులు గైడ్‌లైన్స్ సూచించి వారికి నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ పంపు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, పంచాయతీ సెక్రటరీ కృష్ణ, సర్వే బృందం పాల్గొన్నారు.

నిజాంసాగర్ : ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొబైల్ యాప్ సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం మండలంలోని బంజేపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వే ప్రక్రియను సబ్ కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. నమోదు చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేయర్లు ఇంటింటికి తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్న తీరును పరిశీలించి గడువులో ఒక పూర్తి చేయాలని, రోజువారి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. సర్వే సందర్భంగా యాప్ ద్వారా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావు లేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని ఆమె సూచించారు. నిర్లక్ష్యం వహించకుండా ఈ నెల ఆఖరులోగా సర్వే పూర్తి అయ్యేలా వేగవంతం చేయాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి బిక్షపతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్, మండల పంచాయతీ అధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే ను పరిశీలించిన ఎంపీడీవో..

రెంజల్ : మండలంలోని కోనేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ గురువారం పరిశీలించారు. ఇందిరమ్మ సర్వేలో ఎలాంటి పొరపాటు లేకుండా పక్కాగా లబ్ధిదారుల పేర్లను నమోదు చేయాలని గ్రామ కార్యదర్శి శివకృష్ణకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి హెచ్. శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి శివకృష్ణ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని తహసిల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని కందకుర్తి, సాటాపూర్, నీలా గ్రామాల్లో



పిట్లం: సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



గాంధారిలో..

నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను స్థానిక తహసీల్దార్ శ్రావణ్ కుమార్ సుడిగాలి పర్యటన చేస్తూ గ్రామ కార్యదర్శులకు సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు రాకుండా కార్యదర్శులు సంయమనంతో వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. అర్హులైన నిరుపేదల విషయంలో జాగ్రత్తతో వ్యవహరించాలని ఆయన అన్నారు. సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు మహబూబ్ అలీ, భాస్కర్, సిహెచ్.సాయిలు, రెవెన్యూ సిబ్బంది గౌతమ్, కారోబార్‌లు సాజిద్, మంగురాం తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను నిర్వహించినట్టు ఎంపీడీవో నరేష్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే మండలంలో వేగవంతంగా కొనసాగుతుందన్నారు. అనంతరం శెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పిల్లలతో ఆయన భోజనం చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్..

గాంధారి : మండలంలోని పీస్కిల్ గుట్ట తండా గ్రామపంచాయతీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేను పాదదర్శకంగా నిర్వహించాలని ఎలాంటి లోటుపాటు లేకుండా అవకతవకల పాటుపడకుండా సర్వే కొనసాగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ రవి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని మేడిపల్లి గ్రామంలో ప్రజలు ఇందిరమ్మ ఇండ్ల సర్వేను తప్పనిసరిగా చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎండి అక్బర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుంజే కిషన్, పిట్ల తిరుపతి, మహబూబ్, గుడారి సాయిలు, అబ్దుల్ నబీ, మైను, జి.వెంకట్రావు, గ్రామపెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.



లింగంపేట్‌లో...

డబుల్ బెడ్ రూమ్‌లను సందర్శించిన హౌసింగ్ ఏఈ



డబుల్ బెడ్ రూమ్‌ల వివరాలను పరిశీలిస్తున్న ఏఈ

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్‌లను హౌసింగ్ ఏఈ హనుమంతరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సర్వేలు త్వరితగతిన పూర్తి చేసి నివేదికలు పంపించాలని సర్వే అధికారులను కోరారు. అదేవిధంగా సర్వేలలో ఎటువంటి తప్పులు జరగకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించి నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఎంపీఓ రాము మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాలలో 70 నుంచి 80 శాతం సర్వే పనులు పూర్తి చేశామని ఇంకా కొన్ని గ్రామాలలో పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా త్వరగా పూర్తిచేసి నివేదికలను అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జుక్కల్ గ్రామపంచాయతీ సెక్రటరీ తోపాటు సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ సెలెబ్రేషన్స్



సెమీ క్రిస్మస్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డిలో ప్రిన్సిపాల్ డాక్టర్. సి.శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఉదయిని ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సెలెబ్రేషన్స్ గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరూ క్రీస్తు జననం గొప్పతనం గురించిన నృత్యాలతో, పాటలతో, నాటకాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రావణి, కల్చరల్ కమిటీ కో ఆర్డినేటర్ పి.సింధూర, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారుల రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీలో కామారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరికీ చోటు లభించిందని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన దుబాసి మాణిక్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్లీనరీ సమావేశాన్ని బుధవారం హైదరాబాద్లో నిర్వహించగా.. ఈ ప్లీనరీ సమావేశంలో నూతన కమిటీ ఏర్పాటు చేయగా, అందులో కామారెడ్డి జిల్లా నుండి ఇద్దరికీ ప్రాధాన్యత లభించిందన్నారు. కార్యవర్గ సభ్యులుగా జి సంఘమేశ్వర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

పిల్లల్లో ఇప్పటినుంచే పరిసరాలపై అవగాహన కలిగించేందుకు విద్యార్థులతో వ్యాసరచన పోటీలను నిర్వహించినట్టు గురు గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల చైర్మన్ గురు రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిసరాల అవగాహనపై గత రెండు మూడు రోజులుగా వ్యాసరచన పోటీలు నిర్వహించి వారికి వివేకానంద బి టాపర్ పాఠశాలలో బహుమతులను గురువారం అందజేశారు. కామారెడ్డి జిల్లాతో పాటు పలు మండలాలలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీలో గెలుపొందిన ఆయా పాఠశాల విద్యార్థులకు ఐటి అసోసియేషన్ తరపున ప్రశంస పత్రాలతో పాటు బహుమతులను కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వివేకానంద బి టాపర్ స్కూల్ వేదికగా అందించినట్టు (టిఐటిఏ) తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా సెక్రెటరీ చెల్లాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బి టాపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ రవిరెడ్డి, ఐటి అసోసియేషన్ సీనియర్ మేనేజర్ ప్రదీప్, ఎస్సార్ విద్యా సంస్థల జోనల్ మెంబర్ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్, ముదాం శ్రీధర్ పటేల్, ఆంజనేయులు, అజయ్, విద్యార్థులు, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను సన్మానించిన యువకులు



మాజీ సర్పంచ్‌ను సన్మానించిన యువత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ మాజీ సర్పంచ్ ఏకార్ పాషాను గ్రామ యువకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ నెల 15న ఢిల్లీలో ఆయనకు జాతీయస్థాయి అవార్డు రావడంతో గ్రామ యువత మర్యాదపూర్వకంగా గురువారం గ్రామంలో శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ యువతకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సంఘాల అదనపు గది నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని చిన్న రేండ్ల ముదిరాజ్ సంఘానికి అదనపుగది నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధుల ద్వారా 5 లక్షల రూపాయలు, గుండాల ముదిరాజ్ సంఘం అదనపు గది నిర్మాణానికి 2 లక్షల 50వేల రూపాయలు రాగా గురువారం కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించినట్టు డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ల శివకుమార్ తెలిపారు. ఈసందర్భంగా సంఘాల సభ్యులు మాట్లాడుతూ.. నిధుల మంజూరుకు కృషిచేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం జీవన్ రెడ్డి, ముస్కు మోహన్ రెడ్డి, పన్నాల నర్సారెడ్డి, బద్దం లింగారెడ్డి, రేండ్ల రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన 13 మంది వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకోగా అందరికి కలిపి 2 లక్షల 97 వేల 500 రూపాయలు చెక్కుల రూపంలో రాగ వాటిని కాంగ్రెస్ నాయకులు గురువారం బాధితులకు అందజేశారు. చెక్కుల మంజూరుకు కృషిచేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివ కుమార్, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్ రెడ్డి, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేండ్ల రాజారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న నాయకులు

'రేవంత్ రెడ్డి ఒంటెద్దు పోకడలు ఒకే కులానికి కొమ్ముకాస్తున్నాయి'

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రేవంత్ రెడ్డి ఒంటెద్దు పోకడలు ఒకే కులానికి కొమ్ముకాస్తున్నాయని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కో-చైర్మన్ అంగరి ప్రదీప్ అన్నారు. మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర కో-చైర్మన్ అంగరి ప్రదీప్ నాయకత్వంలో గురువారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. మాలల మద్దతుతో అధికార గద్దె నెక్కి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి మాలలను విస్మరిస్తూ మాలలపై దుష్ప్రచారాన్ని చేయడాన్ని నిరసిస్తూ అసెంబ్లీ ముట్టడి చేశామన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యుండి అన్ని సబ్బండ వర్గాలకు న్యాయం చేయాల్సిన రేవంత్ రెడ్డి ఒక మాదిగ కులానికి మాత్రమే సపోర్ట్‌గా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రేవంత్ రెడ్డి దోరణిలో మార్పు రాకుంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డి రాజకీయ జీవితాన్ని బొంద పెట్టడానికి మాలలు సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కన్వీనర్ మందాల భాస్కర్, మాదాసు రాహుల్, ఎన్పీ వీరస్వామి, ప్రణయ్, దాసరి విశాల్, చిక్కుడు గుండాలు, మన్నె శ్రీధర్ , బలవంతరావు తదితరులు పాల్గొన్నారు

సారంగాపూర్ బీఈడీ కాలేజీలో యోగ వర్క్ షాప్



యోగా వర్క్ షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సారంగాపూర్ బిఈడి కలాశాలలో యోగ, అండర్ స్టాండింగ్ సెల్ఫ్ ప్రాజెక్ట్‌లో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సాయిలు సూచన మేరకు యోగా వర్క్ షాప్‌ను యోగ రామచందర్, యోగ సిద్దిరాములు గురువారం ప్రారంభించారు. ఛాత్రోపాధ్యాయులకు తరగతులు నిర్వహించారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యవంతమైన ఆహారం సాత్విక ఆహారం తీసుకోవాలని సూచించారు. అలాగే బిఈడి విద్యార్థులకు, ఛాత్రోపాధ్యాయులకు, ఆసనాలను చూపిస్తూ చేయిస్తూ వాటి లాభనష్టాలను వివరించారు. ప్రతి ఒక్కరు 41 రోజులు సాధన చేసినట్లయితే మన శరీరంలో అనేకమైన మార్పులు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కోఆర్డినేటర్ డాక్టర్ వి.శ్రీనివాస్, యోగ ప్రాజెక్ట్ ఇంచార్జి డాక్టర్ ఆర్ కరుణాకర్, సువర్చల, రవీందర్, హరిత, గణేష్, నరెందర్, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికే ప్రతిభా పరీక్షలు

- జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్



గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి ప్రతిభా పరీక్షలు ఉపయోగపడతాయని జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్ అన్నారు. జిల్లాస్థాయి జీవశాస్త్ర ప్రతిభ పరీక్ష రాధాకృష్ణ పాఠశాల నిజామాబాద్‌లో గురువారం నిర్వహించారు, అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి ఆశోక్ అభినందించారు. విజేతల్లో ఇంగ్లీష్ మీడియం విభాగంలో మొదటి విజేతగా మెండోర జెడ్పిహెచ్ఎస్ హర్షిత, రెండవ విజేతగా జెడ్పిహెచ్ఎస్ చౌట్‌పల్లి సబసదియ, తెలుగు మీడియం విభాగంలో మొదటి విజేతగా మెండోర జెడ్పిహెచ్ఎస్ ఎం.ఆజయ్, రెండవ విజేతగా మెండోర జెడ్పిహెచ్ఎస్ సిహెచ్ శ్రావణి, మెడల్ స్కూల్ రెసిడెన్షయల్ స్కూల్ విభాగంలో మెదటి విజేత గా ఆర్మూర్ టిజీఎంఎస్ కె. అనిష, రెండవ విజేతగా వర్ని ఎంజేపిటి(జీ) ఎం.జస్మితను అభినందించారు. కార్యక్రమంలో జీవశాస్త్ర ఫోరం జిల్లా కమిటీ అధ్యక్షులు శేఖర్ , ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ ,రాష్ట్ర పోరం బాద్యులు ఎంవిఆర్ చారి ,సాయిబాబా, సాయినాథ్, మధుసూదనా చారి , లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు



ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డిని మొట్టమొదటిసారి పట్టణ బిజెపి నాయకులు తెలంగాణ అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసి అసెంబ్లీ ఆవరణలో వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానంగా మున్సిపాలిటీలో ఉన్న సమస్యల పైననే కాకుండా సభ్యత్వ నమోదు విజయవంతంగా చేయడం అభినందనీయమని అన్నారు. వీలైనంత త్వరలో బూత్ కమిటీలను పూర్తిచేసి సంస్థాగతంగా పట్టణ కమిటీని పూర్తి చేసి మున్సిపాలిటీ ఎన్నికలకు సిద్ధం కావాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి పులి యుగంధర్, బిజెపి పట్టణ కార్యదర్శి మిర్యాల్కర్ కిరణ్, బీజేవైఎం పట్టణ మండల అధ్యక్షులు కలిగోట్ ప్రశాంత్, నరేష్ చారి, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, ఓబీసీ మోర్చా ఆ పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, గిరిజన మోర్చ పట్టణ అధ్యక్షులు పీర్ సింగ్ నాయక్, బీజేవైఎం నాయకులు రెడ్డబోయిన దక్షిణ మూర్తి, బట్టు రాము తదితరులు పాల్గొన్నారు .

జనవరి మొదటి వారంలో

తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్

- తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ క్రికెట్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర ఆరంభంలో తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో టిసిఎ నిజామాబాద్ జిల్లా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీసీసీఐ గుర్తింపు కోసం రూరల్ క్రికెట్ ఆన్ గ్లోబల్ వికెట్ అనే అనుసంధానంతో తెలంగాణ వ్యాప్తంగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న అన్ని జిల్లాలలో తెలంగాణ క్రికెట్ వ్యాపించి ఉందన్నారు. ఇప్పటివరకు ప్రైమ్ మినిస్టర్ కప్, తెలంగాణ గోల్డ్ కప్, ఆల్ స్టార్ క్రికెట్ కప్, ఫ్రీడమ్ కప్ పేర్లతో ఎన్నో విధాలుగా వివిధ వయోపరిమితులలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌తో సహా 32 జిల్లాలలో ఈసారి తెలంగాణ గోల్డ్ కప్ పేరుతో క్రికెట్ సంబరాలు జరుపుకోనున్నామన్నారు.

జనవరి నెలలో ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నామన్నారు. అయితే ముందుగా నమోదు చేసుకున్న 32 జట్లకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో టాలెంట్ సర్చ్‌ను సైతం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు రూ.50వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.25 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్టు వివరించారు. ముఖ్యంగా ఈ టోర్నమెంట్ల ద్వారా ఆసక్తి ఉన్న క్రీడాకారులను స్థాయిలో ప్రాతినిధ్యం వహించేందుకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పై స్థాయిలో నిర్వహించే టోర్నమెంట్లు, శిక్షణ శిబిరాలకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ టోర్నమెంట్ కు వివిధ సంఘాలు, విద్యాసంస్థలు, క్రీడా సంఘాలు, యువజన సంఘాలను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ తెలంగాణ క్రికెట్ ఆసోసియేషన్ ప్రతినిధులు నయూమ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మద్దతు తెలిపిన ఉపాధ్యాయుల

నవతెలంగాణ-మెండోర

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం బోజన విరామ సమయంలో కాంప్లెక్స్ ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు తెలిపారు. అందులో భాగంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి వారిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేయడం వల్ల విద్యాశాఖ కార్యాలయాలు, కేజీబీవీల్లో వివిధ రకాల పనులు, బోధనలు కుంటుపడుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించాలని, సమ్మెను విరమింపజేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అప్పటి వరకు వారికి మినిమం టైంస్కేల్ ఇవ్వాలని సూచించారు. ఉద్యోగ భద్రత కల్పించాలనీ, ఉద్యోగ విరమణ అనంతరం సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.



మాట్లాడుతున్న పలువురు

గుండెపోటుతో లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ గంగా టవర్స్ నందు నివసిస్తున్న విద్యుత్ శాఖ సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్ర వర్మ గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. బాల్కొండ యందు విధులు నిర్వహిస్తున్న ఈయన విధి నిర్వహణలో నిర్విరామ సేవలు చేసినట్టు విద్యుత్ శాఖ ఉద్యోగులు తెలిపారు. ఈయన కుమారుడు విదేశాలలో ఉండగా వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర ఉద్యోగులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో 13 వరోజు సమ్మెలో భాగంగా గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు భారీ ర్యాలీ చేపట్టి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రాజు, భూపెందర్ మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధనకు 13 రోజులుగా నిరసనలు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవట్లేదని, ఇకనైనా రెగ్యులరైజేషన్ సత్వరమే చేయాలని కోరారు. 20 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తూ విద్యాశాఖను సర్వతోముఖాభివృద్ధికి కష్టపడుతున్నామన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. వీరికి నందిపేట్ మండల విద్యాశాఖ అధికారి గంగాధర్, మాధురి, మండల విద్యాశాఖ అధికారి సత్యానారాయణ సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, నాయకులు ప్రకాష్, అప్సర్, రవి కిరణ్, జాన్ సత్యపాల్ గంగాధర్, ప్రభు, రమేష్, రాణి, సుప్రజ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు హాకీ, టేబుల్ టెన్నీస్, ఉషూ, జూడో క్రీడలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేడు హాకీ, టేబుల్ టన్నీస్, ఉషూ, జూడో క్రీడలు నిర్వహిస్తారని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సీఎం కప్ -2024 లో క్రీడాకారులకు పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో గ్రామ స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ఈనెల 16 నుండి 21 వరకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలలో భాగంగా గురువారం ఆర్చరి క్రీడాకారులను ఎంపిక చేశారు. యోగ, కబడ్డీ, బాడ్మింటన్, ప్రెస్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దాదాపు 1200 వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన, ఎంపికైన వారిని ఈనెల 27 డిసెంబర్ 2024 నుండి 02 జనవరి 2025 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పంపనున్నారు. ఈనెల 20న హాకీ ఎంపికలు ఓల్డ్ కలెక్టర్ గ్రౌండ్‌లో టేబుల్ టెన్నిస్ ఎంపికలు ఆఫీసర్స్ క్లబ్‌లో జూడో పోటీలు డిఎస్ఏ స్విమ్మింగ్ పూల్, సుబాష్ నగర్ నందు, ఉష ఓల్డ్ కలెక్టర్ గ్రౌండ్ నందు నిర్వహించానున్నామని తెలిపారు. మండల స్థాయి విజేతలు ఈ క్రీడా ప్రాంగణంనకు ఉదయం 9 గంటలకు ఆధార్‌కార్డు లేదా పుట్టిన తేది తెలుపు ధృవీకరణ పత్రంతో హాజరు కావాలని అన్నారు.



స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన తలారి ప్రసాద్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి 1998-99 బ్యాచ్ స్నేహితులు రూ.64,500 ఆర్థిక సహాయాన్ని ప్రసాద్ పిల్లల పేర్లు మీద బ్యాంకులో ఫిక్స్ చేసినట్టు రేషన్ డీలర్ రమేష్ తెలిపారు. ప్రసాద్ కూతురుకు ఆదర్శ స్కూల్‌లో ఒకరికి 5వ తర గతి వరకు ఫ్రీ ఎడ్యుకేషన్ ఇస్తామని హామీ ఇచ్చిన యాజమాన్యం సుమలత అశోక్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పెరుగు రమేష్, జి.గంగాధర్, బి. సుమలత ఆదర్శ స్కూల్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఇల్లు కాలిపోయిన కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని ఎంజి తాండ పరిధిలోని భూక్యతండకు చెందిన మోతీలాల్ ఇల్లు ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌కు గురై పూర్తిగా కాలిపోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించి ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాల మహానాడు మండల నాయకుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మాల మహానాడు మండల నాయకులు ముందస్తు అరెస్టు చేశారని మండల మాల మహానాడు నాయకుడు బంగ్లా వసంతరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాల మహానాడు పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి చేపట్టడంతో ముందస్తు అరెస్టులు చేయడం అన్యాయం అన్నారు. మండల కేంద్రంలో మాల మహానాడు నాయకులు బంగ్లా వసంత్ రావు, హరీష్‌ని గురువారం ఉదయం 5 గంటలకు అరెస్టు చేశారని తెలిపారు. రాజ్యాంగబద్దంగా వర్గీకరణ జరిగే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. ఇలాంటి అరెస్టులను ఖండిస్తూ ప్రభుత్వానికి హెచ్చరించారు.

పేదల భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన గుండువడ్ల గంగారం, ఆయన తమ్ముడు గుండువడ్ల శ్రీనులకు సంబంధించిన 3.1 ఎకరాల భూమి సర్వే నంబర్ 423/28 సర్వే నెంబర్‌కు సంబంధించిన భూమిని కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట రాములు అన్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని గురువారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 సంవత్సరాలుగా వ్యవసాయ భూమిలో పూల తోట సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వారి భూమిని నిజామాబాద్‌కు చెందిన ముస్తాయిడ్ పుర ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ రజాక్ అక్రమ కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. తప్పుడు సమాచారంతో మోసం చేసి పేదల భూమి కబ్జా చేస్తున్న సయ్యద్ అబ్దుల్ రజాక్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న పెద్ది వెంకట్రాములు

ఏర్గట్లలో శ్రీ శివ మార్కండేయ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో శివ మార్కండేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శతాధిక దేవత విగ్రహ ప్రతిష్టాపన చార్యులు గురుమంచి చంద్రశేఖర్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు రాకేష్ శర్మ మాట్లాడుతూ.. మొదటిరోజు గణపతి పూజతో కార్యక్రమాలు మొదలయ్యాయన్నారు. శుక్రవారం ఆలయం వద్ద నిత్య పూజలు, శివపార్వతుల కల్యాణ మహెూత్సవం, పల్లికిసేవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఉత్సవాలకు మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పద్మశాలి సంఘ సభ్యులు కోరారు.

డయల్ యువర్ ఆర్‌టిసి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిజామాబాదు రీజియన్ లో డయల్ యువర్ ఆర్.టి.సి. కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 04 నుండి 05 గంటల వరకు నిర్వహిస్తామని ఆర్టిసి రీజనల్ మేనేజర్ టి.జోస్నా ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాదు, కామారెడ్డి జిల్లాల ప్రయాణీకులు ఈ సదుపాయమును సద్వినియోగము చేసుకొని తమ సమస్యలను సూచనలకు నిజామాబాద్ రీజనల్ మేనేజర్ 9959226011, నిజామాబాద్ డివిజనల్ మేనేజర్ 9959226013, ఆర్మూర్ డిపో మేనేజర్ 9959226019, బోధన్ డిపో మేనేజర్ 9959226001, నిజామాబాద్ -1 డిపో మేనేజర్ 9959226016, నిజామాబాద్ -2 డిపో మేనేజర్ 9959226017, కామారెడ్డి డిపో మేనేజర్ 9959226018, బాన్సువాడ డిపో మేనేజర్ 9959226020 ఫోన్ నెంబర్ లకు ఫోన్ చేసి తెలుపగలరని అన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్



రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని గురువారం నగరంలోని నాందేవాడలో గల బిసి బాలుర సంక్షేమ వసతి గృహంలో రవాణాశాఖ, రక్షణశాఖ సంయుక్త సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోటార్ వెహికల్ ఇన్‌స్ట్రక్టర్ కిరణ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి స్రవంతి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్ట్రక్టర్లు, అసిస్టెంట్ బిసి డెవలప్మెంట్ ఆఫీసర్ నర్సయ్య, ఐదార్ జిల్లా మేనేజర్ వర్ష హాజరై వసతి గృహ బాలురకు రోడ్డు భద్రతపై అనేక సూచనలు, సలహాలు మౌఖికంగా వీడియోల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ అధికారులు రాజు, బాల కృష్ణ పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ నివారణ పశు వైద్య శిబిరం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో ఉచిత గర్భకోశ నివారణ పశువైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో పశుగణాభివృద్ధి సంస్థ పాల్గొని శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సంకరజాతి కృత్రిమ గర్భధారం ద్వారా పుట్టిన దూడలను ప్రదర్శించారు. గేదెలలో ఎక్కువ పాలు పిండే రైతులకు పాల పోటీలు నిర్వహించారు. ఉత్తమ రైతులకు పాల క్యాన్లు, క్యాల్షియం ద్రావణం ప్రోత్సాహంగా రైతులకు అందజేశారు. పాల ఉత్పత్తిలో ఉత్తమ రైతులు శ్రీకాంత్‌రెడ్డి, జి.సాయిలు, ఎం.సాయిలును శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, డాక్టర్ సంజీవ్ కుమార్, డిఎల్ఎండి అర్షమాది మాజీద్, జుగల్ కిషోర్, గోపాలమిత్రులు మురళి, కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

- కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం
- కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-విలేకరులబృందం

కంఠేశ్వర్: దేశ రాజ్యాంగాన్ని రచించిన బాబాసాహెబ్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన అహంకారి దేశ హెూం మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని నూడా చైర్మన్ కేశ వేణు డిమాండ్ చేశారు. దేశానికి పట్టుకున్న ఇద్దరు అహంకారులు ఒకరు ప్రధాని నరేంద్ర మోడీ అయితే, మరొకరు హెూం మంత్రి అమిత్ షా అని అన్నారు. దేశంలోని పౌరులందరూ సమాన హక్కులతో ఉండాలని బాబాసాహెబ్ అంబేద్కర్ సంవిధానాన్ని రచిస్తే కేంద్ర హెూం మంత్రి అంబేద్కర్ పట్ల అనుచితంగా కించపరిచే విధంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం నగరంలోని పూలాంగ్ చౌరస్తాలోని అంబేద్కర్ చౌరస్తా వద్దకు కాంగ్రెస్ నేతలు మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ గౌడ్ చేరుకొని అంబేద్కర్ విగ్రహానికిపాలభిషేకం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు మరలా పునరావృతమైతే బిజెపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదు అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్, మాజీ నగర మేయర్ ఆకుల సుజాత,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంభూపాల్, మాజీ కార్పొరేటర్ రాజేష్, సృజన్, శ్రీశైలం, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు వేణు రాజు, తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : జిల్లా కేంద్రంలోని నాందేవాడ చౌరస్తాలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ.. అమిత్ షా అసెంబ్లీ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించడం సిగ్గుచేటన్నారు. పార్లమెంటులో అంబేద్కర్‌ని ఎన్నిసార్లు అనడం ఏమిటని అదే హిందూ దేవుని ప్రార్థన చేస్తే ఏడు జన్మలు స్వర్గాన్ని పొందుతారు అంబేద్కర్ అన్నడం అందరికీ ఫ్యాషన్‌గా అయిందన్నారు. ఇలా అనడం ఆయన పెద్దమనిషికి మనువాదమే గొప్ప భావిస్తూ తనలోనున్నటువంటి భావజాలాన్ని పైకి తేవడమే జరుగుతున్నది అని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మనందరి మీద ఉందని రాజ్యాంగం అవమానించిన వారిని ఎంతటి వారినైనా సరే తొలగించ తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నల్వాల నరసయ్య, రాజు, మెకానిక్ తుకారం సభ్యులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కంఠేశ్వర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పార్లమెంటులో చేసిన అనుచిత వ్యాఖ్యలపై జాతికి క్షమాపణ చెప్పాలని, కేంద్ర హెూంమంత్రి పదవికి రాజీనామా చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్‌పి రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్‌లో ఇండియా కూటమి భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రదర్శించడం ప్రతిపక్ష పార్టీలు పదేపదే రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబాసాహెబ్ పేరు ఉచ్చరించడాన్ని నరనరానా మనువాద భావజాల ఆలోచన నిండివున్న బిజెపి నాయకులు తట్టుకోలేకపోతున్నారని అన్నారు. భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా ఉండడానికి కారణం అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగమే కారణమని పేర్కొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి బిజెపి నాయకుడు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్ షా వెంటనే అంబేద్కర్ కి క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని అంబేద్కర్ యువజన నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవరాజ్ ఎంపీటీసీ రాజు అంబేద్కర్ సంఘ అధ్యక్షులు సాగర్, అరుణ్, లక్ష్మణ్, సతీష్, ప్రభాకర్, సత్యనారాయణ, అనిల్, రాజ్ కుమార్, సురేందర్, ప్రవీణ్, ఇమ్మానియేల్, వినోద్, సంజీవ్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగా ప్రసాద్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాపై బిజెపి అధిష్టానం చర్యలు తీసుకోవాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన క్యాబినెట్ నుండి అమిత్‌షాను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నరేందర్, నాయకులు నిమ్మ రాజేంద్రప్రసాద్, ఉట్నూరి ప్రదీప్, సుంకేట శ్రీనివాస్, సింగిరెడ్డి శేఖర్, నల్ల గణేష్ గుప్తా, గణేష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కంఠేశ్వర్: కేవీపీఎస్ ఆధ్వర్యంలో..

కమ్మర్‌పల్లి : వేల్పూర్ మండలం పడగల్‌లో కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎస్సీ సంఘం ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మతో శవ యాత్ర నిర్వహించి, అనంతరం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. హెూంమంత్రి అమిత్‌షా యావత్తు భారతదేశ ఎస్సీ లందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో హెూం మంత్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ పేరు పలకడం ఫ్యాషన్ అయ్యిందని, చేసిన వ్యాఖ్యలను తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఆ వ్యాఖ్యలను వెనెక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించి, భారత రాజ్యాంగం నిర్మాతను అగౌరపరిచేలా మాట్లాడినందుకు భారత ప్రజలందరికి క్షమాపణ కోరాలని ఎస్సీ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సంఘాల పెద్దమనుషులు, సభ్యులు పాల్గొన్నారు



జక్రాన్‌పల్లిలో..



కమ్మర్‌పల్లిలో..

నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-ఏర్గట్ల/ఎడపల్లి/ఆర్మూర్

ఎస్సి వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి హైదరాబాద్‌కు వెళ్ళేందుకు ప్రయత్నించిన మాలమహానాడు సంఘం నాయకులను గురువారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సి వర్గీకరణలో భాగంగా మాకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని తెలిపారు. ఎస్సి వర్గీకరణకు కచ్చితంగా అడ్డుకుంటామన్నారు. అరెస్ట్ అయిన వారిలో మాల మహానాడు మండలాధ్యక్షులు గన్నారపు రాజేశ్వర్, దిబ్బ సుదర్శన్, ఈర్గాల గణేష్, కుండ చక్రి, ఈర్గాల నాగార్జున, తదితరులు ఉన్నారు.

ఎడపల్లి: తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతున్న మాల మహానాడు మండల నాయకులను ముందస్తుగా ఎడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. మాల మహానాడు మండల అధ్యక్షులు బేగరి సాయిలు, రవికుమార్, తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

ఆర్మూర్ : మాలల పట్ల రేవంత్ రెడ్డి అనుచిత వాక్యాలను కండిస్తూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య పిలుపు మేరకు గురువారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం లో భాగంగా మాలమహానాడు రాష్ట్ర నాయకులను పట్టణ పోలీస్ లు ముందరస్తూ అరెస్టులు చేసినారు.

సైబర్ నేరాలను పసిగట్టాలి



మాట్లాడుతున్న షీటీం కానిస్టేబుల్ ప్రియాంక

నవతెలంగాణ-మద్నూర్

సాంకేతిక సైబర్ నేరాలను పసిగట్టాలని ఏఎస్ఐ సుధాకర్, బాన్సువాడ షీ టీం కానిస్టేబుల్ ప్రియాంక అన్నారు. తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం జూనియర్ కళాశాలలో కామారెడ్డి పోలీసు కళాబృందం వారిచే సాంకేతిక సైబర్ నేరాలపై, షీ టీంపై, డ్రగ్స్, ట్రాఫిక్ పోలీసు రూల్స్‌పై గురువారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. సమాజంలోని యువత సైబర్ నేరాలను పసిగట్టాలని, ఇంట్లో తల్లిదండ్రులకు, అక్కాచెల్లెళ్లకు అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు. సమాజంలో జరుగుతున్న యదార్థ సంఘటనలను కొన్నింటిని ఉదాహరించి కథారూపంలో చెప్పారు. బాన్సువాడ షీ టీం సభ్యురాలు ప్రియాంక మాట్లాడుతూ.. మహిళలపట్ల, అక్కాచెల్లెండ్లపట్ల అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే 100 నెంబర్‌కు డయల్ చేయాలని తెలిపారు. కామారెడ్డి పోలీస్ కళాబృందం సభ్యులు సాయిలు, ఎం అనిల్, ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సుమన్, ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత, సంస్కృతోపన్యాసకులు బి.వెంకట్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, నరహరిప్రసాద్, జే.గణేశ్, సంతోష్, రాము, నాగేంద్ర, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాత్మిక సాధనలో యోగ భాగం

- మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి

ఆధ్యాత్మిక సాధనలో ఒక భాగమే యోగా అని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుపియా అన్నారు. గురువారం పట్టణంలోని యోగ కేంద్రంలో ఏర్పాటు చేసిన యోగ సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, క్రీడాకారులకు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. యోగా సంస్కృతి అంటే వ్యాయామ సాధనల సమాహారాల ఆధ్యాత్మిక రూపం ఇది అధ్యాత్మిక సాధనలలో ఒక భాగం అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, గరిపల్లి అంజయ్య గుప్తా, జగన్నాథం, రామ్‌రెడ్డి, అంజయ్య, అనిల్‌రెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలానికి చెందిన వృద్ధుడు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈనెల 13న రాత్రి ఒక వృద్ధుడు కుప్కల్ గ్రామ శివారులో పొలంలో స్పృహ కోల్పోయి పడిపోయి ఉన్నాడని సమాచారం రాగా పోలీసులు వృద్ధుడిని అంబులెన్స్‌లో నిజామాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్పించారు. వృద్ధుడి ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా ఆ వృద్ధుడు బాబానగర్ కాలనీకి చెందిన కుండల పెద్దరాజన్న(5)గా కుటుంబ సభ్యులు గుర్తించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మరణించాడు. వృద్ధుని భార్య కుండల కసమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై జి.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి



విద్యార్థితో చదివిస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

విద్యలో ప్రగతి సాధించాలనుకున్న విద్యార్థులకు తప్పనిసరిగా చదవడం, రాయడం రావాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు తమ బోధన సాగించాలని మండల విద్యాశాఖాధికారి ప్రవీణ్ కుమార్ సూచించారు. కాటేపల్లి తండా ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలామంది చదవడం, రాయడం రాకుండా పైతరగతులకు ఉత్తీర్ణులు అవుతున్నారని, అటువంటివారు ప్రగతి సాధించలేరని చెప్పారు. ఇటువంటి సమస్యను పరిష్కరించడం కోసం ఉపాధ్యాయులు సామర్థ్య ఆధారిత బోధనను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

మినీ ట్రాలీ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓయువకుడు మృతిచెందారు. మోస్రాగ్రామానికి చెందిన లక్ష్మణ్(23) మొబైల్ షాప్‌కు సంబంధించిన సామాను నిమిత్తం గురువారం మోస్రా నుండి నిజామాబాద్‌కు వస్తున్నాడు. ఈ సమయంలో మల్లారం గండి వద్ద ట్రాలీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. తలకు, ఇతర చోట్ల గాయాలు అయ్యాయి. దారిన పోయేవారు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి తెలుపగా హాస్పిటల్‌కు తరలించే సమయంలో మృతిచెందాడు. మృతుని అన్న కొత్తిమీరకర్ రాహుల్ దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆరిఫ్ తెలిపారు.

బోరు మోటర్ ప్రారంభం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బోరు మోటర్‌ను ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి బోర్ తవ్వకాలు చేయాలని ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశానుసారం బోరు మోటర్ బిగించి ప్రజలకు తాగునీరు అందించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సకాలంలో పరిష్కరిస్తామని గ్రామస్తులకు ఆయన భరోసా ఇచ్చారు. అలాగే గ్రామంలోని వివిధ సమస్యలు (ట్రాన్స్ఫార్మర్) విద్యుత్ సమస్యలు, మరింత నీటి సమస్య, అలాగే రోడ్డు సమస్య ఉందని గ్రామస్తులు దృష్టికి తీసుకురావడంతో విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మిషన్ భగీరథ ఏఈ వినోద్‌తో, విద్యుత్ అధికారులతో చరవాణిలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ బొండ్ల సాయిలు, సొసైటీ డైరెక్టర్ చెన్నంగారి సుఖేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భిక్కనూరు సంజీవరెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ గోనె శ్రీకాంత్, వేముల సాయిలు, వేముల రాజు, అక్కమొల్ల లక్ష్మయ్య, సాయిబాబు, సంగమేష్ మరియు గ్రామ పెద్దలున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

ఎల్లారెడ్డి మండలంలోని రేపల్లెవాడకు చెందిన పిట్ల స్వప్న గురువారం రోడ్డు ప్రమాదంలో మరణించింది. దీంతో మున్సిపల్ మాజీ చైర్మెన్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మెన్ రజితా వెంకటరాంరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. స్వప్న పార్థివదేహానికి నివాళులర్పించారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ సామెల్, మాజీ సర్పంచ్ సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

మాజీ జెడ్పిటిసి తల్లి మృతి

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పిటిసి సభ్యుడు తానాజీరావు తల్లి రత్నబాయి చికిత్స పొందుతూ హైదరాబాదులో బుధవారం రాత్రి మృతి చెందింది. గత వారం రోజుల క్రితం గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. రత్నబాయి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

కంటి ఆపరేషన్ల శిబిరం

నవతెలంగాణ - ధర్పల్లి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 19 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 8మందికి మోతే బిందు ఆపరేషన్లకు కొరకు లయన్స్ కంటి ఆసుపత్రి, మరో ఎనిమిది మందికి ఆపరేషన్ల కొరకు ఆర్మూర్ అసుపత్రికి పంపినట్టు ఆప్తమిక్ అధికారి హరినాథ్ నెహ్రూ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మురళి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులను అడ్డుకోవడం అవివేకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాల జేఏసీ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ గురువారం డిచ్ పల్లి ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఓ శ్రీనివాస్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా నాయకులు మురళి, ఐ ఎఫ్ టియు జిల్లా నాయకులు గంగాధర్, కారోబార్ల సంఘం అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ అర్ధరాత్రి నాయకులను పంచాయతీ కార్మికులను అక్రమ అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. రేవంత్ సర్కార్ గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోగా కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఉద్యమిస్తుంటే అక్రమ అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రజాపాలన, ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులపట్ల అత్యంత దుర్మార్గంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. తక్షణమే గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఒకవేళ కార్మికుడు మరణిస్తే దహన సంస్కారాలకు 30వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా ప్రతి కార్మికుడికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. లేనియెడల రానున్న రోజుల్లో గ్రామపంచాయతీ కార్మికులతో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో షేక్ ఆసిఫోద్దీన్, రవి, పోశెట్టి, సంజు, సాయిలు, దుర్గ, రాజేశ్వర్, కృష్ణ, రమేష్, రవి, మహేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు